బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, మే 17: మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్ గేట్ వద్ద గురువారం పిడుగుపడి మాడ్గుల మండలంలోని కలకొండ గ్రామానికి చెందిన ప్రవీణ్‌చారి మృతి చెందగా, మండల కేంద్రానికి చెందిన నిరంజన్‌గౌడ్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో ప్రవీణ్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేశారు. అదే విధంగా పిడుగుపాటుకు గురై వెల్దండ మండలంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న నిరంజన్‌గౌడ్‌ని ఎమ్మెల్యే పరామర్శించి, రూ.5 వేలు అందజేశారు. ఆయన వెంట కల్వకుర్తి, మాడ్గుల మండలాల నాయకులు ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు, మే 17 : ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు విడతల్లో జరిగే ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 240 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 25 వరకు మొదటి దశలో రూ.200తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మే 15 నుంచి మే 27 వరకు దోస్త్ వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని జూన్ 3న మొదటి దశ సీట్లు కేటాయించి జూన్ 4 నుంచి 10 వరకు సెల్ఫ్ రిపోర్ట్‌కు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అనంతరం రెండవ దశ, మూడవ దశలు కూడా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

చేవెళ్లటౌన్ : చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దోస్త్ (DOST) వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీవరకు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ.ఏ, బీ,కామ్, సీ.ఎ, బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజడ్సీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు

బొంరాస్‌పేట, మే 17: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని రైతులకు 50 శాతం రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు తుంకిమెట్ల, బొంరాస్‌పేట, దుద్యాలలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పోను 40 కిలోల జనుము విత్తనం బస్తా ధర రూ.1448లు, 30 కిలోల జీలుగ విత్తనం బస్తా ధర రూ.1116 లుగా ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనురాధ కోరారు.

అష్టలక్ష్మి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఆర్కేపురం, మే 17 : అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి శుక్రవారం ఆర్కేపురం డివిజన్ వాసవీకాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో తన మొక్కును చెల్లించుకొని 21 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి దేవాలయంలోని అన్నప్రసాదశాలను, నిత్య అన్నదానం సత్రాన్ని కలియ తిరిగి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిలారెడ్డి, నియోజకవర్గ వర్కింగ్ అధ్యక్షురాలు పటేల్ సునీతారెడ్డి, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, సాజీద్, ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్ కుమార్, జగన్మోహన్‌రెడ్డి, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, శ్యామ్ గుప్త, మహేందర్‌రెడ్డి, పుష్పలతారెడ్డి, అనురాధ, స్వప్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలను ఏర్పాటు చేయండి

బండ్లగూడ, మే 17: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ గ్రామంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ముద్దం రాము కమిషనర్ శరత్‌చంద్రను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిమాయత్‌సాగర్‌లో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా కర్రల సహాయంతో విద్యుత్ సర్వీస్ తీగలను తీసుకువస్తున్నారని వాపోయారు. దీంతో గాలి వీచినప్పుడు విద్యుత్ అంతరాయం కలిగి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించిన విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో విత్తనాలు వేస్తున్న రైతులు

వానకాలం సాగుకు సన్నద్ధం

పొలం పనుల్లో బిజీబిజీగా అన్నదాతలు
దుక్కుల సాగులో నిమగ్నం
కొన్ని చోట్ల విత్తనాలు వేసిన రైతులు

యాచారం, మే17: వానకాలం పంటలను సాగు చేసేందుకు రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా గడుపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురువడంతో రైతులు మేడిపల్లి, తక్కళ్లపల్లి, నానక్‌నగర్ తదితర గ్రామాల్లో వానకాలం పంట సాగులో నిమగ్నమయ్యారు. సాగు భూముల్లో ఎరువులను చల్లారు. దుక్కులు దున్ని సాగుకు భూములను సిద్ధంగా ఉంచుతున్నారు. సాగుకు సరిపడా వర్షం కురువడంతో శుక్రవారం పలు గ్రామాల్లో రైతులు కాడెద్దుల సాయంతో నాగలితో పొలాలు దున్ని జొన్న, కంది పంటల విత్తనాలు వేశారు. మే24న రోహిణి కార్తె నుంచి రైతులు పత్తి, మొక్కజొన్న, జొన్న, ఆముదం, కంది, ఉలువలు తదితర మెట్ట పంటల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో మరో భారీ వర్షం కురిస్తే వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి. కొంత మంది ఇప్పటికే దుక్కి పొలాల్లోనే పత్తి గింజలు విత్తారు. వానకాలం 2024లో నాలుగు ప్రధాన పంటలైన వరి 4500 ఎకరాలు, పత్తి 1500 ఎకరాలు, రెడ్‌గ్రామ్ 400 ఎకరాలు, జోవర్ 250 ఎకరాల సాగు విస్తీర్ణం ఆశించినట్లు వ్యవసాయాధికారి సందీప్ తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

మురుగుకాల్వ సమస్యను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, మే17: ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామంలో నెలకొన్న మురుగుకాల్వ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గ్రామాన్ని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. షాద్‌నగర్ నుంచి వచ్చే మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, తిరుపతిరెడ్డి, బాలరాజ్ గౌడ్, ఫకీర్‌బాషా, వెంకటేశ్‌గౌడ్, గణేశ్, మల్లేశ్‌గౌడ్, హరికృష్ణ, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవి, చారి, చందుయాదవ్, మల్లేశ్, సురేశ్, శివకుమార్, శేఖర్ గౌడ్, నారాయణ, రామచంద్రయ్య, శ్రీను, యాదయ్య, శేఖర్, సుధాకర్, దేవా, రమేశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



లింగారెడ్డిగూడలో మురుగుకాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నర్సరీ మొక్కలను సంరక్షించాలి

యాచారం, మే17: వేసవిలో నర్సరీ మొక్కలను ఎండిపోకుండా సంరక్షించాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. గ్రామంలో పరిసరాల శుభ్రతకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవిలో నర్సరీ మొక్కలు ఎండిపోకుండా గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పంచాయతీ రికార్డులను పక్కాగా అమలు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్‌రెడ్డి

దుర్గంధాన్ని భరించలేక పోతున్నాం..

అనుమతుల్లేని ఆయిల్ పరిశ్రమను తొలగించాలి
కొత్తూరు మున్సిపల్ కమిషనర్‌కు తండా రైతులు ఫిర్యాదు

కొత్తూరు, మే 17: ఆయిల్ నుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. అనుమతిలేకుండా నడుస్తున్న పరిశ్రమను తొలగించాలని పరిసర ప్రాంత రైతులు కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కొత్తూరు తండా సర్వేనంబర్ 52, 72 సర్వే నంబర్లలో షెడ్డు వేసి ట్యాంకర్లలో ఆయిల్ తెచ్చి నిల్వచేస్తున్నారు. అనంతరం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయిల్ నుంచి వస్తున్న దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని వారు కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతులు లేకుండా నిల్వచేస్తున్న ఆయిల్‌ను పరిశ్రమను అక్కడి నుంచి తొలగించాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వెంట గోవింద్, అంజి, రామ్జూ, సోమ్లా, సర్కు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీఎంకు వినతి

సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

బొంరాస్‌పేట, మే 17 : ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం పొందిన బొంరాస్‌పేట ఈనాడు విలేకరి వెంకటయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కొడంగల్, బొంరాస్‌పేట మండలాల విలేకరులు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వెంకటయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని సీఎం చెప్పారు. అనంతరం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. వెంకటయ్య కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు భార్యకు పింఛను మంజూరు చేయాలని కోరారు. ఇందుకు శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు కిషన్‌రావు, నర్సింహులు, ప్రభాకర్, ఫకీరప్ప, పృథ్వీరాజ్, అనంతప్రసాదవ్, రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, రాకేశ్,అంజిలయ్య పాల్గొన్నారు.

కోనాపూర్ వద్ద కారు బోల్తా

పోలీసులను చూసి పారిపోతుండగా ఘటన
నల్లబెల్లం, పటికను స్వాధీనం చేసుకున్న పెట్రోలింగ్ సిబ్బంది

ఆమనగల్లు, మే 17: పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి ఓ కారు అతివేగంగా వెళ్తూ పల్టీకొట్టి ప్రమాదానికి గురైంది. ఈ ఘటన ఆమనగల్లు మండలం కోనాపూర్ గేట్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై బాల్‌రామ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ –శ్రీశైలం జాతీయ రహదారిపై పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కారు డ్రైవర్ పోలీసులను చూసి కారును అతివేగంగా నడుపుతూ పారిపోయే ప్రయత్నం చేశాడు. కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. డ్రైవర్ పారిపోగా, కారులో నాటు సారాకు ఉపయోగించే 16 బస్తాల నల్లబెల్లం, 3 బస్తాల పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాల్‌రామ్ పేర్కొన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి

తిర్మలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో ఈశ్వరప్ప

కులకచర్ల, మే 17: ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలని వికారాబాద్ డీసీవో ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రైతుల వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓపీఎంఎస్‌ను ఎంట్రీ చేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు మిల్లులకు పంపించాలని సూచించారు. తూకాన్ని సక్రమంగా చేయాలని, డబ్బులు సకాలంలో వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డి పాల్గొన్నారు.

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషయాన్ని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాతానని, ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యాన్ని కొంటామని రైతులకు హామీ ఇచ్చారు. నాగారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని రైతుల దగ్గర కొనుగోలు చేసి ఏజెన్సీ వారికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో నర్సింహులు ఉన్నారు.

ధారూరు : నాగారం వడ్లు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ధారూరు పీఏసీఎస్ వైర్మన్ సత్యనారాయణ రెడ్డి

ఘనంగా పోలేరమ్మ ఉత్సవాలు..

బషీరాబాద్, మే 17 : మండల పరిధిలోని కొర్విచేడ్‌గని గ్రామంలో పోలేరమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామ మహిళలు పిండి వంటలు తయారు చేసుకుని, బోనం కడువలతో వెళ్లి పోలేరమ్మకు సమర్పించారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు అనంతయ్య, ఎంపీటీసీ వడ్డే శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ ఉల్గప్ప, కోటప్ప, తిరుపతి, చందర్, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం బడంగ్‌పేటకు ..

బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

బడంగ్‌పేట, మే17: ఇంత కాలం బాలాపూర్‌లో కొనసాగిన తహసీల్దార్ కార్యాలయం ఇక నుంచి బడంగ్‌పేటకు మార్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చిన తర్వాత ఖాళీగా ఉన్న భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చడానికి అధికారులు చక చకా పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం బోర్డును ఏర్పాటు చేశారు. తహసీల్దార్ చాంబర్, ఆర్ఐల చాంబర్లు, డీటీ, కంప్యూటర్ ఆపరేటర్స్, రికార్డు రూం, సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయానికి రంగులు వేశారు. బాలాపూర్‌లో ఉన్న తహసీల్దార్ కార్యాలయం ఇరుకుగా ఉండటం, కార్యాలయానికి వచ్చే వారికి అనువుగా ఉండక పోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే సముదాయంలో ఉండాలన్న ఆలోచనకు పునాది వేసినట్లు ఉంది. మరికొన్ని కార్యాలయాలు కూడా బడంగ్‌పేటకు రానున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ అధికారులు కూడా స్థలం దొరికితే బడంగ్‌పేటలో కార్యాలయం ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదు ఆరు రోజులలో బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం బడంగ్‌పేటకు షిఫ్ట్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలి

కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్

కులకచర్ల, మే 17 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నిర్వహించే పాఠశాలల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ నాయక్ అన్నారు. శుక్ర వారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా నిర్వహించే పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, ఈ నెల 25వరకు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పనులకు సంబంధించిన డబ్బులను డ్రా చేసే విధంగా చూడాలని, దీనికి ప్రధానోపాధ్యాయులు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు వచ్చిన యూనిఫామ్‌క్లాత్‌ను గ్రామాల్లోని టైలర్లకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబీబ్‌హెమద్, ఏపీఎం శోభ, మండల సమాఖ్య ప్రతినిధులు అలవేణి, లక్ష్మి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్

అనుమతులు లేకుంటే కూల్చివేతలే

సిద్ధన్నమదుగుతండాలో ఓ ఇంటి ప్రహరీని పరిశీలిస్తున్న తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్

పెద్దేముల్, మే 17: గ్రామ పంచాయతీల అనుమతులు లేకుండా ఇండ్ల నిర్మాణం చేపడితే నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్ హెచ్చరించారు. శుక్రవా రం మండల పరిధిలోని నాగులపల్లి, సిద్ధన్నమదుగుతండా, గోపాల్‌పూర్, ఇందూరు గ్రామా ల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు, కంపోస్టు షెడ్డులు, వైకుంఠధామాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నిరంతరంగా పారిశుద్ధ్య పనులను చేయించాలని, ప్రతి రోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణతోపాటు తడి,పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అదే విధంగా వర్మి కంపోస్టు ఎరువుల తయారీని కూడా చేపట్టాలన్నారు. అంతర్గత రోడ్లన్నీ ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సిద్ధన్నమదుగుతండా లో సర్వే నంబర్ 206లో గుర్యానాయక్ అనే వ్యక్తి సీసీ రోడ్డుపైకి ఇంటి ప్రహరీ నిర్మిస్తున్న విషయమై హెచ్చరించారు. ఇందూరు గ్రామంలో దుద్యాల రాంచందర్, దుద్యాల నర్సిం హులు, సాతంగారి నాగమ్మ నిబంధనలు పాటించకుండా ఇంటిని నిర్మిస్తుంటే ఏమి చేస్తున్నావ్ అని పంచాయతీ కార్యదర్శి రాజుపై డీఎల్పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరికీ మొదటి దఫా నోటీసులు పూర్తి అయ్యాయి కాబట్టి రెండవ దఫా నోటీసులను శుక్రవారం జారీ చేసి వెంటనే నిర్మాణాలను ఆపివేయించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో అక్రమంగా ఇంటి నిర్మాణాలను ప్రోత్సహిస్తే పంచాయతీ కార్యదర్శుల పైనా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.ఈ కార్యక్రమలో మండల ఇన్‌చార్జి ఎంపీవో రమేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, అరుణ, సంగీత, రాజు ఉన్నారు.